క్లుప్తంగా

ప్రశాంతంగా 5వ తరగతి ప్రవేశ పరీక్ష

పరవాడ: మండలంలోని తానాం మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన 5వ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ప్రిన్సిపాల్ బి.అప్పలనాయుడు చెప్పారు. 372 మందికి గానూ 334 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 38 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

వైదికులు, సిబ్బందికి నూతన వస్త్రాలు



స్థానాచార్యులకు వస్త్రం అందజేస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో తొలి విడద చందనం అరగదీత కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైదికులతో పాటు సిబ్బందికి ఈవో త్రినాథరావు నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, డిప్యూటీ ఈవో సుజాత, ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, దొడ్డి రమణ, సాయినిర్మల పాల్గొన్నారు.

గ్యాస్, విద్యుత్ ప్రమాదాలపై అవగాహన



గ్యాస్ ప్రమాదాలు నివారించడంపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

సబ్బవరం: గ్యాస్, విద్యుత్ వినియోగంలో అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా ఇళ్లలో అగ్నిప్రమాదాలను నివారించవచ్చునని సబ్బవరం అగ్నిమాపక అధికారి దిలీప్ కుమార్ తెలిపారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గొర్లివానిపాలెంలోని జంగాల కాలనీలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తరుచూ ఇళ్లలో జరిగే గ్యాస్,విద్యుత్ ప్రమాదాలపై సిబ్బంది డెమో ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్‌లు కె. అప్పలనాయుడు, కె. రాజారావు, కె. యల్లాజీ, ఫైర్ మెన్‌లు పి. గౌరీ శంకర్,టి. వెంక టరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల వితరణ



సరకులు అందజేస్తున్న గంట్ల శ్రీనుబాబు

సింహాచలం: సమాజంలో స్వచ్ఛంద సంస్థల సేవలు ప్రశంసనీయమని సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు, వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు అన్నారు. జీవీఎంసీ 93వ వార్డు పరిధి శ్రీనివాసనగర్‌లోని మనసు గర్ల్స్ కేర్ సెంటర్‌లో ఉన్న 28 మంది అనాథ బాలికలకు ఆదివారం ఆయన నిత్యావసర సరకులు అందజేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా అనాథలకు సేవలందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గణేష్ యువజన సేవా సంఘం సభ్యులు గంట్ల కిరణ్‌బాబు, తిరుమలరెడ్డి సుధీర్‌బాబు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజా కార్యక్రమంలో భాగంగా హరేకృష్ణ, హరే రామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణ, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, అంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యోగా వీరులు



సాధించిన పతకాలతో క్రీడాకారులు, నిర్వాహకులు (ఫైల్)



యోగాసనాల్లో విద్యార్థులు

- రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీల్లో సత్తాచాటుతున్న విద్యార్థులు
- ఎన్టీపీసీ సహకారంతో శిక్షణ

పరవాడ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న బాల బాలికలకు యోగాపై ఆసక్తి పెంపొందించడానికి సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పాఠశాలల్లో ప్రత్యేక యోగా తరగతులను నిర్వహిస్తోంది. దీని కోసం సీఎస్సార్ విభాగం నుంచి నిధులను కేటాయిస్తుంది. ఏడేళ్ల నుంచి పాఠశాలల్లో నిర్వహిస్తున్న యోగా తరగతులను సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక మంది విద్యార్థులు రాణిస్తున్నారు. ఎన్టీపీసీ యాజమాన్యం ప్రోత్సాహంతో మండలంలో ఐదు వేల మంది విద్యార్థులు యోగాలో శిక్షణ తీసుకుంటున్నారు. పలు పోటీల్లో పతకాలు సాధించి ఔరా అనిపిస్తున్నారు.

మంచి పేరు తేవడమే లక్ష్యం



నా పేరు ఎస్.అభిరామ్. నేను వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాను. మా నాన్న శ్రీను టైలర్. అమ్మ లక్ష్మి బ్రాండెక్స్‌లో పనిచేస్తున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో రాష్ట్ర, జిల్లా స్థాయిలో పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాను. విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో కాంస్య పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాను. జాతీయ స్థాయిలో ప్రతిభను చాటి పాఠశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తెస్తా.

– ఎస్.అభిరామ్, 7 తరగతి

యోగాపై పట్టు సాధించడమే ధ్యేయం



మాది అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామం. నేను తానాం గురుకుల పాఠశాలలో 8 తరగతి చదువుతున్నాను. మూడేళ్లుగా యోగాలో శిక్షణ పొందుతున్నాను. యోగాలో మెళకువలు నేర్చుకొని రాష్ట్ర, జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొని పలు పతకాలు సాధించాను. యోగా విద్యలో పూర్తి నైపుణ్యం సాధించడమే నా లక్ష్యం. 2019లో కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వెండి పతకం, 2020లో విశాఖలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో బంగారు పతకం, 2022లో గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కాంస్య పతకం, 2022లో విజయవాడ, చోడవరంలో లో జరిగిన పోటీల్లో బంగారు పతకం సాధించాను.

– కె.వెంకటవైష్ణవి, 8 తరగతి

ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తా..



ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన నేను స్థానిక జెడ్పీ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాను. తల్లిదండ్రులు చేపల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. మూడేళ్లుగా యోగాలో శిక్షణ పొందుతున్నాను. 2022లో విశాఖలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో వెండి పతకం సాధించాను. యోగాసన పోటీల్లో జాతీయ స్థాయిలో పతకాలు సాధించి ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే నా లక్ష్యం.

– ఎస్.అభిమన్యు, 7 తరగతి, ముత్యాలమ్మపాలెం

యోగాతో ఆరోగ్యం



నాయుడుపాలెం ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాను. 4 తరగతి నుంచి యోగాలో శిక్షణ పొందుతున్నాను. 2022లో గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొని కాంస్య పతకం, అదే ఏడాది పరవాడలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో బంగారు పతకం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాను. యోగా శిక్షకుడి వద్ద రోజుకు గంట పాటు సాధన చేస్తా. ప్రతీ రోజు యోగా సాధన చేయడం వల్ల ఆరోగ్యంగా ఉన్నాను.

– మండల ధనుష్, 5 తరగతి, నాయుడుపాలెం

ఎన్టీపీసీ సహకారంతో శిక్షణ



సింహాద్రి ఎన్టీపీసీ సహకారంతో ఏడేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యోగాలో శిక్షణ ఇస్తున్నా. యోగాలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ పోటీలకు వెళ్లేలా ఎన్టీపీసీ ప్రత్యేక కృషి చేస్తుంది. ఢిల్లీ, బెంగళూరు, కోల్‌కతా, ముంబయ్ వంటి నగరాల్లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అయ్యే ఖర్చులను సంస్థే భరిస్తుంది. పిల్లలకు అవసరమైన సూత్ర నీతిక్రియ, జల నేతిక్రియలపై శిక్షణ ఇస్తున్నా.

– సీహెచ్.ఆంజనేయులు, యోగా శిక్షకుడు

కుమ్మర్లను ఆదుకోవాలి



ములకల చెరువు వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

పరవాడ: మట్టి కుండల వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గొర్లివానిపాలెం కుమ్మరి కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకుడు అనకాపల్లి నాగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. కుమ్మరి కులస్తులకు మద్దతుగా చెరువు వద్ద ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ములకల చెరువులో మట్టి తీసి కుండలు తయారు చేసి జీవనం సాగిస్తున్న వారికి కొన్నాళ్ల నుంచి చెరువులో మట్టి దొరక్క ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. చెరువు సమీపంలోని ఏర్పాటు చేసిన పలు కాలనీల ప్రజల వినియోగిస్తున్న వాడుక నీటిని శుద్ధి చేయకుండా చెరువులోకి వదలడంతో మట్టి పాడై పోయి కుండల తయారీకి పనికి రాకుండా పోతుందన్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీ ద్వారా చెరువులోకి విడుదల చేస్తున్న మురుగునీటిని శుద్ధి చేయడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆత్మీయ కలయిక.. అపురూప వేడుక



ఒకే వేదికపై కలుసుకున్న నాటి మిత్రులు

మల్కాపురం: వారంతా 38 ఏళ్ల కిందట మల్కాపురం బోర్డు స్కూల్‌లో కలిసి చదువుకున్నారు. వీరిలో చాలా మంది ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం వేర్వేరు రాష్ట్రాలు, దేశాల్లో స్థిరపడ్డారు. వీరిలో ఓ మహిళ.. మూడు నెలల కిందట పదో తరగతి చదివిన నాటి స్కూల్ ఫొటోలు చూడగా.. ఒక ఆలోచన తట్టింది. నాడు అలా ఉన్నాం.. నేడు తనతో చదువుకున్న మిత్రులు ఎక్కడెక్కడ ఉన్నారో, ఎలా ఉన్నారో తెలుసుకోవాలని ఆత్మీయ కలయికకు యోచించారు. కొంత మంది మిత్రుల ఫోన్ నంబర్లు సేకరించి వాట్సప్ గ్రూప్ క్రియేట్ చేశారు. దీంతో ఆత్మీయ కలయిక తేదీ ఖరారు చేశారు. దీనిలో భాగంగా వారు స్థానికంగా గల ఓ హోటల్‌లో ఆదివారం కలిసి సందడి చేశారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆత్మీయ కలయిక కోసం అమెరికా, బెంగళూరు, విజయవాడ, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల నుంచి వచ్చారు.

ప్రపంచ నటుడు చార్లీ చాప్లిన్



చార్లీ చాప్లిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు

సీతంపేట: ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది సినీ ప్రేక్షకుల హృదయాల్లో గూడు కట్టుకున్న చిరంజీవి చార్లీ చాప్లిన్ అని పలువురు వక్తలు కొనియాడారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో చార్లీ చాప్లిన్ 134వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చాప్లిన్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఆచార్య ఎస్.ఎ.డి.పాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాయి కళానికేతన్ చైర్మన్ గంటా అప్పలనాయుడు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ నవ్వులో ఏడుపును నటిస్తూ.. హాస్య కిరణరసాలను చాప్లిన్ అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకుల హృదయాలపై చెరగని ముద్ర వేశారన్నారు. నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ఆకలి చాప్లిన్‌ను నటుడిగా మార్చిందన్నారు. ఆయన గొప్ప మానవతావాదని పేర్కొన్నారు. అనంతరం 1940లో చాప్లిన్ నటించి దర్శకత్వం వహించిన ది గ్రేట్ డిక్టేటర్ సినిమాను ప్రదర్శించారు. కార్యక్రమంలో సీనియర్ నటుడు ఎస్.కె.మిశ్రో, ఫిల్మ్ సొసైటీ ఉపాధ్యక్షుడు కాశీ విశ్వేశ్వరరావు, సహాయ కార్యదర్శి బి.చిన్నారావు, బాబ్జి, శివకుమార్, అర్చన, గాయత్రి పాల్గొన్నారు.

బాలికపై దాడి చేసిన వ్యక్తి అరెస్టు

మల్కాపురం: బాలికపై దాడి చేసిన వ్యక్తిని మల్కాపురం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. శ్రీహరిపురం గణేష్ మందిరం అవతల రోడ్డులో 17 ఏళ్ల బాలిక తల్లితో కలిసి కొంతకాలం నుంచి నివాసం ఉంటుంది. మైనర్ గాజువాకలోని వస్త్ర దుకాణంలో పని చేస్తుంది. కాగా ఓ లోకల్ చానల్‌లో పని చేస్తున్న శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన జగన్నాథరావు (అలియాస్ జగన్)మైనర్ విధులు ముగించుకొని వచ్చే సమయంలో వెంట పడేవాడు. ఈ నెల పదో తేదీన మైనర్ విధులు ముగించుకొని వస్తున్న సమయంలో గాజువాక డిపో వద్ద ఇద్దరు యువకులతో మాట్లాడడాన్ని జగన్ చూశాడు. దీన్ని తట్టుకోలేక అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో మైనర్ ఇంటికి జగన్ వెళ్లి ఇద్దరి యువకులతో మాట్లాడిన విషయాన్ని ప్రస్తావించి ఆపై వెంటనే బ్లేడ్‌తో ఆమె మెడపై దాడి చేసి గాయపరిచాడు. దీంతో మైనర్ కేకలు వేయడంతో తల్లి బయటకు వచ్చి జరిగిన విషయాన్ని తెలుసుకుని మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన సీఐ లూథర్‌బాబు మైనర్ ఇచ్చిన సమాచారం మేరకు దర్యాప్తు చేసి పూర్తి ఆధారాలతో దాడికి పాల్పడిన జగన్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు.ఈ ఘటనకు కారణం తానే అనే జగన్ అంగీకరించడంతో ఆయన్ను ఆదివారం సాయంత్రం అరెస్టు చేశారు.

అల్లర్లు సృష్టిస్తే పీడీ యాక్ట్



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐ సీహెచ్ సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు, సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి అల్లర్లు చేయకుండా ఉండాలని, లేనిపక్షంలో పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చాలా మంది రాత్రి పూట మద్యం తాగి గొడవలు సృష్టిస్తున్నారని, అటువంటి వాటిని ఉపేక్షించమన్నారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని చెప్పారు. అనంతరం రౌడీ షీటర్లను పోలీస్ సిబ్బంది దగ్గరుండి ఇళ్లకు పంపించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు ధర్మేంద్ర, అప్పలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పాలనలో పేదలకు ఆర్థిక భరోసా



గండివానిపాలెంలో పథకాల లబ్ధిని వివరిస్తున్న నాయకులు



ధర్మారాయుడుపేటలో ఓ ఇంటికి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ అంటిస్తున్న నాయకులు

పరవాడ: జగనన్న పాలనలోనే పేదలకు ఆర్థిక భరోసా లభించిందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు అన్నారు. జగనన్నే మా భవిష్యత్- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా మండలంలో పెదముషిడివాడ, రావాడ గ్రామాల్లో నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు.

- పెదముషిడివాడ శివారు గండివానిపాలెం, రావాడ శివారు ధర్మారాయుడుపేట గ్రామాల్లో వైస్ ఎంపీపీ బి.నాగేశ్వరరావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. పార్టీ నాయకులు పల్లా అప్పారావు, నందవరపు శ్రీనివాసరావు, ఒమ్మి అర్జునరావు పాల్గొన్నారు.
- వెన్నలపాలెంలో సర్పంచ్ వెన్నల అప్పారావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సంక్షేమ పథకాల లబ్ధిని ఇంటింటికి వెళ్లి వివరించి వారి ఆమోదంతో ఇంటిపై మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనరు వెన్నల సన్యాసిరావు, నాయకులు మాసవరపు ముత్యాలనాయుడు, వెన్నల సింహాద్రి పాల్గొన్నారు.



మహిళలకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న బీసీ సెల్ అధ్యక్షుడు కొటాన రాము

ఉత్సాహంగా 'మానమ్మకం నువ్వే జగన్'

సబ్బవరం: సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధిలోని ఆదిరెడ్డిపాలెంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఆదివారం సాయంత్రం ఉత్సాహంగా నిర్వహించారు. మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధిని వివరించారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో మోసపూరిత విధానాలను తెలియజేశారు. కుటుంబ యజమాని అనుమతితో వారి ఇళ్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మద్దతు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, సబ్బవరపు నారాయణమూర్తి,ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్

సబ్బవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తి ప్రదాత అని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము కొనియాడారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బంగారమ్మపాలెంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంతో పాటు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ తినిపించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయుకులు గొర్లి నూకరాజు, సూరిశెట్టి రాము, దువ్వాడ అప్పారావు,కిల్లి సత్యనారాయణ,ఎంఎల్ నాయుడు,వంకర దేముడు,మల్లేశ్వరరావు,బత్తిన కోటి, దొడ్డి చినప్పారావు,కోనేరు శివ పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి కృషి



బీసీ సంఘ కొత్త నాయకులను సత్కరిస్తున్న నమ్మి అప్పలరాజు, భానుమూర్తి

గోపాలపట్నం: బీసీల సంక్షేమానికి కృషి చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి నమ్మి అప్పలరాజు యాదవ్ కోరారు. ఎన్ఏడీ జంక్షన్‌లోని సంఘ కార్యాలయంలో ఆదివారం నమ్మి అప్పలరాజు, అనకాపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బోయిన భానుమూర్తి యాదవ్ ఆధ్వర్యంలో ఇటీవల జాతీయ బీసీ సంక్షేమ సంఘంలో నియమితులైనా వారిని ఘనంగా సత్కరించారు. అనకాపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కిల్లాడ అప్పలరాజు, మాడుగుల నియోజకవర్గ అధ్యక్షుడు మొల్లి సన్నిబాబు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి కోన నాగేశ్వరరావులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి, సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. 139 బీసీ కులాలను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీల జనగణన చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని, దీన్ని ఉద్యమంగా తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో గోకివాడ నాయుడు, లొడగల రమేష్, చల్లా నానాజి తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం దేవస్థాన నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



దేవస్థానం అధికారులకు చెక్ అందిస్తున్న సత్యాల మహేష్, అప్పారావు దంపతులు

మల్కాపురం: మల్కాపురం నగరాల వీధికి చెందిన సివిల్ కాంట్రాక్టర్లు సత్యాల మహేష్, ఎం.అప్పారావు దంపతులు సింహాచలం దేవస్థాన నిత్యాన్నదాన కార్యక్రమానికి రూ.1,00,116 విరాళంగా అందించారు. సంబంధిత చెక్‌ను ఆదివారం దేవస్థానం అధికారులకు అందజేశారు. దేవస్థానానికి వచ్చే భక్తులకు నిత్యం అన్నదానం చేస్తున్నారని, తమ వంతు కానుకగా ఈ చిన్న మొత్తాన్ని ఇచ్చామని దాతలు తెలిపారు.

ఘనంగా 'ఒడియా-తెలుగు సంగమం'



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బైజయంత్ జై పాండా

ఎంవీపీ కాలనీ: ఒడిశా వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో ఒడియా- తెలుగు సంగమం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయం ఆవరణలో ఆదివారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమాన్ని పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు బైజయంత్ జై పాండా ముఖ్యఅతిథిగా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, ఒడిశాలు అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న రాష్ట్రాలు అన్నారు. అన్ని అంశాల్లోను ఇచ్చిపుచ్చుకొనే ధోరణితో అభివృద్ధికి ముందడుగు వేయాలన్నారు. పార్టీ జాతీయ కార్యదర్శి సునీల్ దేవధర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ జీవీఎల్ నరసింహరావు, విష్ణుకుమార్‌రాజు, పీవీఎన్ మాధవ్, మేడపాటి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మెగా షష్టి పూర్తి వేడుక



షష్టిపూర్తి జరుపుకొంటున్న దంపతులు

బీచ్ రోడ్డు: వాసవీ ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో మెగా షష్టి పూర్తి వేడుక ఘనంగా జరిగింది. 60 ఏళ్లు వయస్సు కలిగిన 102 దంపతులు పెళ్లి కొడుకు, పెళ్లి కూతురులా ముస్తాబై బాజా భజంత్రీల మధ్య పెళ్లి చేసుకున్నారు. ఈ సందర్భంగా వాసవీ ఇంటర్నేషనల్ క్లబ్ డిస్ట్రిక్ట్ వీ201ఏ గవర్నర్ కందుల నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో మొదటి సారిగా ఇంత పెద్ద సంఖ్యలో షష్టి పూర్తి కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. వేద పండితులు గో పూజ, ఆయుష్య హోమం నిర్వహించారు.

'ప్రైవేటీకరిస్తే సహించం'

కూర్మన్నపాలెం: కార్మికుల కష్టాలను పట్టించుకోకుండా కార్పొరేట్ కంపెనీల యజమానులకు కొమ్ము కాస్తున్న కేంద్ర ప్రభుత్వంపై తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని, ప్రైవేటీకరణ చేస్తే కార్మిక వర్గం సహించదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్ష 794వ రోజుకు చేరుకుంది. స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించి, పూర్తిస్థాయి ఉత్పత్తిని పునరుద్ధరించాలని, బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలని నాయకులు కోరారు. వేతన ఒప్పందాన్ని అమలు చేయాలని, విభజన హామీలను విస్మరించి రాష్ట్రాన్ని అన్ని విధాలా నష్టాల్లోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా ప్రజలను చైతన్యం చేసే విధంగా కార్మికులు ఈ నెల 25న సీఎండీ, డైరెక్టర్ల బంగ్లాలను, ఇళ్లను ముట్టడించాలని పిలుపునిచ్చారు. సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

ఎవరి స్టాళ్లలో వారే విక్రయించాలి

సీతంపేట: ఎవరికి కేటాయించిన స్టాళ్లలో వారే కూరగాయలు విక్రయించాలని జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ శాఖ అధికారి ఎస్.కె.యాసిన్ అన్నారు. నరసింహనగర్ రైతుబజార్‌లో ఆదివారం ఆయన సమక్షంలో స్టాళ్లకు డ్రా తీశారు. డ్రాలో వచ్చిన నంబర్ల ప్రకారం రైతులు, డ్వాక్రా వ్యాపారులకు వాటిని కేటాయించారు. ఇతరులు స్టాళ్లలో విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధరల పట్టీలో పొందు పర్చిన రేట్లకే కూరగాయలు విక్రయించాలని, వినియోగదారులు, రైతుబజార్ సిబ్బందితో గౌరవంగా నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ పి.చినబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు.